200 కోట్ల సంపదను వదిలి సన్యాసం!

- గుజరాత్ పారిశ్రామిక వేత్త దంపతుల సంచలన నిర్ణయం
- ఆస్తిని విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించిన భవేశ్‌భాయ్
- రెండేండ్ల కిందటే సన్యాసం స్వీకరించిన వారి పిల్లలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: వందల కోట్ల సంపద, చుట్టూ పనివాళ్లు.. అత్యంత ఖరీదైన భవంతులు.. ఇవన్నీ వదిలి సన్యాసం స్వీకరించాలని గుజరాత్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, ఆయన భార్య నిర్ణయించుకున్నారు. భౌతిక ప్రపంచానికి దూరంగా వెళ్లి ఓ సన్యాసిగా మారేందుకు భవేశ్ భాయ్ భండారి, ఆయన భార్య తమ రూ.200 కోట్ల ఆస్తిని విరాళంగా ఇవ్వడానికి సిద్ధమయ్యారు. జైన సామాజికవర్గానికి చెందిన వీరు సన్యాస మార్గంలో వెళ్లేందుకు 'దీక్ష'ను చేపట్టారు. ఇకపై కేవలం భిక్షాటన ద్వారా తమ రోజువారీ జీవనం కొనసాగించబోతున్నారు. ఈ సందర్భంగా సబర్‌కాంత జిల్లాలో భండారి నివసిస్తున్న హిమ్మత్‌నగర్‌లో భారీ ఊరేగింపు కూడా నిర్వహించారు. 'మెటీరియలిజం' ఉచ్చులో చిక్కుకోకుండా ఆధ్యాత్మిక అన్వేషణ వైపు అడుగేయాలని నిర్ణయించుకున్నట్టు వారు ప్రకటించారు. ఏప్రిల్ 22న కొంతమంది సమక్షంలో నది ఒడ్డున వారి సన్యాస స్వీకరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భండారి పిల్లలు ఇప్పటికే సన్యాసం దిశగా అడుగులేయటం ఆ దంపతుల్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని తెలిసింది. భండారి కుమారుడు, కుమార్తె 2022లో సన్యాసం స్వీకరించారు.

జూన్ 29 నుంచి అమర్‌నాథ్ యాత్ర

నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

జమ్ము, ఏప్రిల్ 14: అమర్‌నాథ్ వార్షిక యాత్ర జూన్ 29 నుంచి ఆగస్టు 19 వరకు కొనసాగుతుందని శ్రీ అమర్‌నాథ్ తీర్థక్షేత్ర బోర్డు శనివారం ప్రకటించింది. 52 రోజులపాటు సాగే యాత్రకు సంబంధించిన ముందస్తు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 15 నుంచి మొదలవుతుందని బోర్డు వెల్లడించింది. దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లోని 3,880 మీటర్ల ఎత్తులోని గుహలో ఏర్పడే మంచులింగాన్ని దర్శించేందుకు ప్రతియేటా నిర్వహించే అమర్‌నాథ్ యాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు.

అయోధ్య రాముడికి 1,11,111 కిలోల లడ్డూలు

మీర్జాపూర్: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17 అయోధ్య రామాలయంలో ప్రసాదంగా పంపిణీ చేయడానికి 1,11,111 కిలోల లడ్డూలను పంపనున్నట్లు దేవ్‌రహ హన్స్ బాబా ట్రస్ట్ ప్రకటించింది. కాశీ విశ్వనాథ ఆలయం, తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు వివిధ ఆలయాలకు ప్రతి వారం ఇలా ప్రసాదం కోసం లడ్డూలను తమ ట్రస్ట్ పంపుతుందని ట్రస్టీ అతుల్ కుమార్ సక్సేనా వెల్లడించారు. అయోధ్య ఆలయ ప్రాణ ప్రతిష్ఠకు 40 వేల కిలోల లడ్డూలను పంపామని గుర్తు చేశారు.

పేద విద్యార్థుల కోసం ఆన్‌లైన్ విద్యా వేదిక

ప్రారంభిస్తున్నట్టు 'సూపర్ 30' ఆనంద్ కుమార్ వెల్లడి

వాషింగ్టన్, ఏప్రిల్ 14: భారత్‌లో నిరుపేద విద్యార్థులకు విద్యను అందుబాటులో తీసుకొచ్చేందుకు త్వరలో 'ఆన్‌లైన్ విద్యా వేదిక'ను ప్రారంభిస్తున్నట్టు 'సూపర్ 30' వ్యవస్థాపకుడు, ప్రముఖ గణితవేత్త ఆనంద్‌కుమార్ ప్రకటించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యను మరింత ఎక్కువమంది విద్యార్థులకు చేరువ చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. వాషింగ్టన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, 'పేదలు తమ జీవితాలను మార్చుకోవాలనే ఆకాంక్షను 'సూపర్ 30' పెంచేలా చేసింది. ఇక్కడ్నుంచి వెళ్లిన కొంత మంది విద్యార్థులు తమ భవిష్యత్‌ను మార్చుకున్నారు. ఒక తరం మార్పునకు విద్య కారణమైంది. 'సూపర్ 30'ని మరింత విస్తరించేందుకు కొత్తగా ఆన్‌లైన్ విద్యా వేదికను స్థాపించబోతున్నా. దీంతో పేదల ఇంటి ముందుకు విద్యను తీసుకెళ్తా' అని అన్నారు. పేదరికం కారణంగా ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రపంచం దృష్టిలో పడటం లేదని, అలాంటి వారికోసం ఆన్‌లైన్ విద్యా వేదికను తీసుకొస్తున్నట్టు చెప్పారు.

ఈడీ కస్టడీ సొమ్ము.. పేదలకెప్పుడు?

తొలుత బెంగాల్‌లో 3 వేల కోట్లు పంపిణీ చేస్తాం

- న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తున్నా
- బెంగాల్ బీజేపీ అభ్యర్థితో ఇటీవల ప్రధాని మోదీ
- 'బ్లాక్ మనీ' తీసుకొచ్చి పేదల ఖాతాల్లో జమ చేస్తానంటూ 2014 ఎన్నికల్లో మోదీ హామీ
- పదేండ్లయినా నల్లధనం మాటెత్తని ప్రధానమంత్రి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): అవినీతి కేసులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకొన్న డబ్బును తిరిగి పేదలకే పంచే యోచన చేస్తున్నట్టు ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్‌లో కృష్ణానగర్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నిలబడిన 'రాజమాత' అమృతా రాయ్‌తో ఆయన ఇటీవల ఫోన్‌లో మాట్లాడారు. తొలుత బెంగాల్‌లో ఈడీ స్వాధీనం చేసుకొన్న రూ. 3 వేల కోట్లను పేద ప్రజలకు ఎలా పంచాలన్న అంశంపై న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తున్నట్టు ఆ ఫోన్‌లో ప్రధాని చెప్పుకొచ్చారు. ఈ ఆడియోను బీజేపీ పరివారం విడుదల చేసింది. ఈసారి ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే, ఈడీ కస్టడీలోని డబ్బును పేదలకు పంచే మార్గాలను చూస్తామని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు.

ఈడీ కస్టడీలో రూ.1.32 లక్షల కోట్లు

మనీలాండరింగ్‌కు సంబంధించి రాజకీయ నాయకులు, వ్యాపారులు, అధికారుల ఇండ్లు, కార్యాలయాలపై 2014 జనవరి 1 నుంచి అక్టోబర్ 31, 2023 మధ్య ఈడీ నాలుగు వేలకు పైగా దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ. 1.32 లక్షల కోట్ల విలువైన సొత్తును సీజ్ చేసింది. ఈ మేరకు గత డిసెంబర్‌లో ఓ ప్రశ్నకు కేంద్రం సమాధానమిచ్చింది. ఈ స్థాయిలో సొమ్మును సీజ్ చేయడం చరిత్రలో మొదటిసారి.

చట్టం ఏం చెప్తున్నది?

ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న రూ. 1.32 లక్షల కోట్ల సొమ్ముంతా ఎక్కడ ఉందన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతున్నది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని సెక్షన్ 9 ప్రకారం.. సీజ్ చేసిన సొమ్ముసంతా కేసు తేలేవరకూ ఈడీ వ్యక్తిగత పద్దుల ఖాతా ఉన్న ఆర్బీఐ లేదా ఎస్బీఐ బ్రాంచీలో జమ చేయాలి. నిందితుడి నేరం రుజువుకాకపోతే, తిరిగి ఆ సొత్తును సదరు వ్యక్తికి అప్పజెప్పాల్సి ఉంటుంది. ఒకవేళ నిందితుడి నేరం రుజువైతే, 'లెక్కలోకి రాని ధనం' కేంద్రప్రభుత్వ ఖజానాలోకి వెళ్తుంది. ఈ డబ్బును జాతి సంపదగా పరిగణిస్తారు. ఈ సొత్తును ఏ పార్టీ కూడా తమ రాజకీయ ప్రయోజనాలకు ఖర్చు చేయడానికి వీలులేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

అప్పుడు కూడా నల్లధనంపై ఇలాగే..

బీజేపీని గెలిపిస్తే, విదేశాలకు తరలిపోయిన నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ఒక్కో భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షల చొప్పున జమ చేస్తానంటూ 2014 ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ హామీనిచ్చారు. పదేండ్లు గడిచింది. నల్లధనం తీసుకొస్తానన్న హామీని ఆయన ఎప్పుడో మరిచిపోయారు. ఇదే విషయమై 2015లో హోంమంత్రి అమిత్ షాను ప్రశ్నిస్తే, 'ఎన్నికల ప్రచారంలో అదో గిమ్మిక్' అంటూ ఆయన తేలిగ్గా కొట్టిపారేశారు.

కెనడాలో భారతీయ విద్యార్థి హత్య

కాల్చిచంపిన దుండగులు

వాంకోవర్: కెనడాలో గుర్తుతెలియని దుండగులు ఓ భారతీయ విద్యార్థిని కాల్చి చంపారు. దక్షిణ వాంకోవర్‌లో చిరాగ్ అంటిల్ (24) అనే విద్యార్థి దుండగుల చేతిలో హత్యకు గురైనట్టు పోలీసులు ఆదివారం వెల్లడించారు. తుపాకీ కాల్పుల శబ్దం వినిపించిందని ఘటనాస్థలం నుంచి తమకు సమాచారం వచ్చిందని, దీంతో అక్కడికి వెళ్లగా కారులో విగత జీవిగా పడున్న చిరాగ్ అంటిల్ కనిపించాడని వాంకోవర్ పోలీసులు పేర్కొన్నారు. చిరాగ్ ఉన్నత చదువుల నిమిత్తం 2022 సెప్టెంబర్‌లో కెనడా వెళ్లారు. యూనివర్సిటీ కెనడా వెస్ట్ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్న అతడికి కొద్ది రోజుల క్రితమే వర్క్ పర్మిట్ కూడా వచ్చింది. 'శనివారం రాత్రి తూర్పు 55వ అవెన్యూ నుంచి తుపాకీ కాల్పులు విన్నానని మాకు కాల్ వచ్చింది. ఇప్పటివరకూ ఎవర్నీ అరెస్టు చేయలేదు. కేసు దర్యాప్తులో ఉంది' అని పోలీసులు తెలిపారు.

జమిలి ఎన్నికలు, యూసీసీ అమలు

- 70+ వారికి 'ఆయుష్మాన్ భారత్'
- 14 అంశాలతో బీజేపీ మ్యానిఫెస్టో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పేదలు, యువత, మహిళలు, రైతుల్ని ఆకట్టుకునేలా వివిధ అభివృద్ధి, సంక్షేమ అంశాలతో బీజేపీ తన మ్యానిఫెస్టో 'సంకల్ప పత్ర'ను విడుదల చేసింది. ఆదివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రస్తావించిన, వన్ నేషన్.. వన్ ఎలక్షన్, ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అంశాలను మళ్లీ చేర్చారు. అయితే వివాదాస్పద ఎన్నార్సీని మాత్రం మ్యానిఫెస్టో నుంచి తప్పించారు. 70 ఏండ్లు దాటిన వారికి 'ఆయుష్మాన్ భారత్'ను వర్తింపజేస్తామని బీజేపీ తాజా మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసింది. దేశంలో నలుదిశలా తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో బుల్లెట్ రైలు తీసుకొస్తామని ప్రకటించింది. 2036 ఒలింపిక్ క్రీడల్ని నిర్వహించేందుకు బిడ్‌లో పాల్గొంటామని తెలిపింది. మొత్తం 14 అంశాలతో మ్యానిఫెస్టోను రూపొందించింది.

ఏటీజీ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన, మ్యాన్-పోర్టబుల్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (ఎంపీఏటీజీఎమ్) ఆయుధ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించినట్టు భారత సైన్యం ఆదివారం తెలిపింది. డీఆర్‌డీవో రూపొందించిన ఈ వ్యవస్థను ఈ నెల 13న పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్ నుంచి పరీక్షించినట్టు వెల్లడించింది. ఈ క్షిపణి వ్యవస్థ అత్యాధునిక యుద్ధ ట్యాంకులను రాత్రి, పగటి వేళల్లో సమర్థంగా ఎదుర్కొంటుందని సైన్యం తెలిపింది. త్వరలోనే సైన్యం అమ్ముల పొదిలోకి చేరేందుకు ఈ ఆయుధ వ్యవస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నది.

నటుడు సల్మాన్ ఇంటి వద్ద కాల్పులు

ముంబై (నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ముంబైలోని సల్మాన్ నివాసమైన గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా తెల్లవారుజామున 5 గంటలకు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు నాలుగు రౌండ్ల పాటు కాల్పులు జరిపారు. ఇది జరిగినప్పుడు సల్మాన్‌ఖాన్, ఇతర కుటుంబ సభ్యులు అంతా ఇంట్లోనే ఉన్నారని తెలిసింది. తాజా ఘటనతో అక్కడ కలకలం రేగింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్రైం బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు ప్రారంభించారు. తుపాకీ కాల్పులు జరిపింది తామేనని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ప్రకటించాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేశాడు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని హెచ్చరించాడు.

సరబ్‌జిత్‌సింగ్ హంతకుడి కాల్చివేత

పాక్‌లో కాల్చి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు



అమీర్ సర్ఫరాజ్

సరబ్‌జిత్ సింగ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని లాహోర్ జైలులో భారత పౌరుడు సరబ్‌జిత్‌సింగ్‌ను హత్య చేసిన పాక్ అండర్ వరల్డ్ డాన్ అమిర్ సర్ఫరాజ్‌ను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అమిర్‌పై కాల్పులు జరిపినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తీవ్రంగా గాయపడిన అతడిని దవాఖానకు తరలించేలోపే మరణించినట్టు పేర్కొన్నాయి. సరబ్‌జిత్ సింగ్ మన దేశంలోని పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. ఆయన కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, వ్యవసాయం చేసేటపుడు సరబ్‌జిత్ సరిహద్దులను దాటి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోయారు. ఆయన గూఢచర్యానికి పాల్పడినట్లు, 1990లో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో బాంబు పేలుళ్లలో 14 మంది పాకిస్థానీల మరణానికి కారకుడైనట్లు పాక్ ఆరోపించింది. ఈ కేసులో ఆయనకు పాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. సరబ్‌జిత్ లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైలులో 23 సంవత్సరాలపాటు మగ్గిపోయారు. భారత పార్లమెంటుపై దాడి చేసిన అఫ్జల్ గురుకు భారత్‌లో మరణ శిక్ష అమలు చేసిన తర్వాత, పాక్ జైలులోని సరబ్‌జిత్‌పై అమిర్‌తోపాటు కొందరు ఖైదీలు దాడిచేశారు. సరబ్‌జిత్ తలకు తీవ్ర గాయాలవడంతో లాహోర్‌లోని దవాఖానకు తరలించారు. కానీ ఆయన 2013 మే నెలలో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఆయన జీవిత కథతో ఓ బాలీవుడ్ సినిమా వచ్చిన సంగతి తెలిసిందే.

బోయపాటి పొలిటికల్ డ్రామా?

ఇంకో హిట్ పడితే.. బాలకృష్ణతో నాలుగు బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన కోడిరామకృష్ణ, ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్‌ల సరసన చేరతాడు దర్శకుడు బోయపాటి శ్రీను. అయిదో హిట్ కూడా పడిందంటే.. బాలయ్యతో అత్యధిక విజయాలను తీసిన దర్శకుడిగా రికార్డు సృష్టిస్తాడు. 50ఏళ్ల కెరీర్‌ని పూర్తిచేసుకోబోతున్న ఓ అగ్ర కథానాయకుడి కెరీర్‌లోనే అత్యధిక విజయాలు ఇచ్చిన దర్శకుడిగా నిలవడం అంటే అది మామూలు క్రెడిట్ కాదు. మరి ఆ క్రెడిట్ దక్కించుకోవాలంటే బోయపాటికి కావాల్సింది బాలయ్యతో ఇంకో రెండు హిట్లు. వాటికోసమే రెండు కథలు సిద్ధం చేశారట. వాటిలో ఒకటి 'అఖండ 2' కాగా, రెండోది పొలిటికల్ డ్రామా. ఇటీవలే ఈ రెండు కథలనూ బాలయ్యకు వినిపించాడట బోయపాటి. బాలయ్యకు పొలిటికల్ డ్రామా బాగా నచ్చిందని తెలుస్తున్నది. అయితే.. ఎన్నికల వేడి ముగిశాక, బాలయ్య అభిప్రాయంలో మార్పు రావచ్చు అనే టాక్ కూడా బోయపాటి సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. బాలయ్య ఏ కథకి ఓకే చెప్పినా తీయడానికి బోయపాటి, చూడ్డానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారు.

థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నా..

చిత్రం

ఉద్వేగాల్ని మనసులోనే దాచుకుని గుంభనంగా ఉండటం కొందరికి చేత కాదు. త్రిప్తి డిమ్రి ఆ తరహా వ్యక్తే. 'ఆనందమైనా, బాధైనా భావోద్వేగం ఏదైనా అస్సలు దాచుకోలేను' అంటున్నది ఈ అందాలభామ. ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్‌సింగ్ జీవితం ఆధారంగా రూపొంది, ఇటీవలే ఓటీటీలో విడుదలైన సినిమా 'అమర్ సింగ్ చంకీల'. బాలీవుడ్ తారలకోసం ముంబాయిలోని ఓ థియేటర్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. సినిమా చూసిన తారలలో త్రిప్తి డిమ్రీ కూడా ఉంది. ఈ సినిమా చూసి ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయింది త్రిప్తి. 'చాలాకాలం తర్వాత నేను చూసిన ఉత్తమ సినిమా ఇది. దర్శకుడు ఇంతియాజ్ అలీని థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నాను. అమర్‌సింగ్‌గా దిల్జిత్ దొసాంజ్ జీవించాడు. అమర్‌జ్యోతిగా పరిణీతి అద్భుతం అనిపించారు. ఓ నిజాయితీగల కళాకారుడి అందమైన, హృదయ విదారకమైన ప్రయాణమే ఈ సినిమా. ప్రేక్షకుల్ని సినిమాలో మమేకమయ్యేలా చేసిన దర్శకుడికి మరోసారి థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది త్రిప్తి డిమ్రీ.

జూన్‌లో భారతీయుడు 2

కథానాయకుడిగా కమల్‌హాసన్‌కీ, దర్శకుడిగా శంకర్‌కీ మరిచిపోలేని జ్ఞాపకంగా నిలిచిన సినిమా 'భారతీయుడు'. 28ఏళ్ల క్రితమే ఇది పాన్ ఇండియా హిట్. విడుదలైన అన్ని భాషల్లో విజయఢంకా మోగించిన ఈ సినిమాకు సీక్వెల్ అంటే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అందుకే 'ఇండియన్ 2' కోసం అన్ని వయసుల వారూ, అన్ని వార్గాల వారూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సినిమా ప్రోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ నెలాఖరున ట్రైలర్‌ను, జూన్‌లో సినిమాను పాన్ వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇతర భాషల్లో 'ఇండియన్ 2'గా విడుదల కానున్న ఈ చిత్రాన్ని తెలుగు మాత్రం 'భారతీయుడు 2' పేరుతోనే విడుదల చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ తెలిపారు. సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ, శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవివర్మన్, సంగీతం: అనిరుద్ రవిచంద్రన్, ఎడిటింగ్: ఎ.శ్రీకర్‌ప్రసాద్, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జైంట్ మూవీస్. నిర్మాతలు: సుభాస్కరన్, జి.కె.ఎం.తమిళ్‌కుమరన్.

హారర్‌కి అందం తోడైతే!?

హారర్ కామెడీ సినిమాలు తీయడంలో దర్శకుడు సుందర్.సి.ది ప్రత్యేకశైలి. తమిళంలో ఆయన దర్శకత్వంలో రూపొందిన 'అరణ్మనై' ఫ్రాంఛైజ్ ప్రేక్షకులను విపరీతంగా కట్టుకుంది. ఈ ఫ్రాంఛైజ్‌లో నాలుగో సినిమా 'అరణ్మనై 4' ఈ నెల 26న థియేటర్లలో విడుదల కానుంది. తెలుగులో 'బాక్' అనే పేరుతో విడుదల చేస్తున్నారు నిర్మాతలు ఖుష్బు సుందర్, ఏసీఎస్ కుమార్. సుందర్.సి. హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తమన్నా, రాశీఖన్నా కథానాయికలు. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలో 'పంచుకో..' అటూ సాగే ఓ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. సాహితీ రాసిన ఈ గీతాన్ని హిప్‌హాప్ తమిళా స్వరపరచగా, రాఘవి హస్కీ వాయిస్‌లో ఆలపించారు. ఈ పాటకు చెందిన వీడియో గురించి మేకర్స్ చెబుతూ 'తమన్నా, రాశీఖన్నాల గ్లామర్ ఈ పాటకు మరింత అందాన్ని తెచ్చింది. వారి గ్రేస్‌ఫుల్ మూమెంట్స్ యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. ట్రెండీ లుక్‌లో ఇద్దరూ అదరగొట్టేశారు. కథలోని కొన్ని ఎక్సయింటింగ్ సన్నివేశాలను కూడా ఇందులో కలపడంతో చూసినవారంతా బావుందని అభినందిస్తున్నారు' అని తెలిపారు. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఇ.కృష్ణమూర్తి అకా కిచ్చ.

ఓ విద్యార్థినాయకుడి కథ

1980కాలంలో జరిగిన వాస్తవిక సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న రాజకీయ నేపథ్య చిత్రం 'జితేందర్‌రెడ్డి'. రాకేష్ వర్రె ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి విరించి వర్మ దర్శకుడు. ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'అ ఆ ఇ ఈ ఉ ఊ..' అంటూ సాగే ఈ సినిమాలోని గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రాంబాబు గోసాల రాసిన ఈ గీతాన్ని గోపీసుందర్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. '1980నాటి కాలంలో విద్యార్థి నాయకుడిగా, అన్యాయాలను ఎదుర్కొనే శక్తిగా ఎదిగిన జితేందర్‌రెడ్డి గురించి ఈ ప్రపంచానికి తెలియాలి. అందుకే అ సినిమా చేస్తున్నాం. వినోదం, సందేశం మిళితమైన గీతం ఇది. సినిమాలోని కీలక సన్నివేశంలో వచ్చే ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. కళాశాల ఎన్నికల్లో గ్రూపుల మధ్య ఏర్పడే కక్షల నేపథ్యాన్ని ఈ పాటలో చూపించాం. యువతరానికి బాగా నచ్చే సినిమా ఇది.' అని నిర్మాత తెలిపారు. వైశాలి రాజ్, రియా సుమన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవిప్రకాశ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్.

భావోద్వేగాల పొట్టేల్

పల్లెటూరి నేపథ్య కథాంశంతోయువచంద్ర కృష్ణ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మాతలు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ నెల 18న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, భావోద్వేగపూరితమైన కథాంశంతో దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. అనన్య నాగళ్ల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అజయ్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.